

ఫెన్సింగ్ తొలగించిన తర్వాత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ తొలగింపు

రాయదుర్గం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమికి ప్రైవేట్ ఫెన్సింగ్ పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో గతనెల 26న ప్రచురితమైన వార్తా కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. గోపన్‌పల్లిలో సర్వేనెంబర్ 37 ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు వేసిన ఫెన్సింగ్‌ను అధికారులు మంగళవారం తొలగించారు.

రేకుల ఇల్లు కూల్చివేత



కూల్చివేసిన ఇల్లు

మియాపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో రేకులతో నిర్మించుకున్న ఇంటిని రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. సమాచారం అందుకున్న కాంగ్రెస్ నాయకుడు మన్నేపల్లి సాంబశివరావు తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూల్చివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడు విషయాన్ని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాడు.

కొత్తకుంట చెరువును పరిరక్షించాలి : బీజేపీ

షాపూర్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్త కుంట చెరువును రాత్రికి రాత్రి కబ్జా చేస్తున్నారని, వారి నుంచి చెరువును పరిరక్షించాలని బీజేపీ నాయకులు కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువు కబ్జా విషయమై కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. చెరువును కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో పత్తి రఘుపతి, బి. రవి, దుర్యోధనరావు ఉన్నారు.

సమస్య సీఎం దృష్టికి తీసుకెళ్తా

● సూపర్‌మ్యాక్స్ కార్మికులకు నర్సారెడ్డి భూపతిరెడ్డి హామీ

దుండిగల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సూపర్‌మ్యాక్స్ కార్మికులు కాంగ్రెస్ నాయకుడు నర్సారెడ్డి భూపతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. కంపెనీని మూసివేసి 18 నెలలు అవుతుందని, వెయ్యిమంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది నుంచి తాము నిరాహారదీక్ష చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. మంగళవారం దీక్షలో రంగన్న, రామకృష్ణారెడ్డి కూర్చున్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

రింగ్‌బస్తీలో రోడ్లు బాగుచేయాలి : సీపీఐ

జీడిమెట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్‌బస్తీలో రోడ్లు బాగుచేయాలని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో 3 నెలల క్రితం రోడ్డును తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డును బాగుచేయకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మంగళవారం నిరసన తెలిపారు. ప్రజానాట్యమండలి అధ్యక్షుడు రాములు, కోశాధికారి సదానంద్, సుధాకర్, కరణ్‌సింగ్, చంద్ర, ఖాదర్, మహేందర్, మున్నీ, రాకేష్ పాల్గొన్నారు.



విశ్వబ్రాహ్మణ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

వివిధ సంఘాల క్యాలెండర్లు ఆవిష్కరణ

పేట్‌బషీరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాణిక్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, యూరో కిడ్స్ గాజులరామారం శాఖ సభ్యులు, కుత్బుల్లాపూర్ మండలం విశ్వకర్మ సంఘం సభ్యులు, జగద్గిరిగుట్ట వాసవీ కన్యాకాపరమేశ్వరి దేవస్థానం సంఘం సభ్యులు, గాయత్రి బ్రాహ్మణ సంఘం సభ్యులు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బిల్డింగ్ బ్లాక్స్ సంస్థ సభ్యులు

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

పేట్‌బషీరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్స్ సంస్థ ప్రతినిధి మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బంగారు తల్లి పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లు, వాటిని ఎలా అధిగమించాలో పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్‌లు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు కమల్‌సింగ్, బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ సంస్థ సభ్యులు ఉష, కస్తూరి, నీరజ, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, వెంకటయ్య, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రావినారాయణరెడ్డినగర్ ఈస్ట్ అసోసియేషన్ కార్యవర్గం

గాజులరామారం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రావినారాయణరెడ్డినగర్ ఈస్ట్ అసోసియేషన్ కార్యవర్గాన్ని కాలనీ వాసులు మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి. నారాయణ, ఉపాధ్యక్షుడిగా కె. భాస్కర్, జనరల్ సెక్రటరీగా హనుమంత్ నాయక్, జాయింట్ సెక్రటరీలుగా మురళీమోహన్, రాములు, ట్రెజరర్‌గా ప్రభాత్ కుమార్ పాడి, ఆర్గనైజర్స్‌గా శ్రీను, గోవింద్, శ్రావణ్, మురళి, నర్సింగ్, ఆలీ, మురళీకృష్ణను ఎన్నుకున్నారు.

పెట్రోల్ బంకుల్లో నో స్టాక్..!



పీపీనగర్‌లో పెట్రోల్ బంకు వద్ద నో స్టాక్ బోర్డు

కూకట్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో పెట్రోల్ బంకులకు వాహనదారులు పోటెత్తారు. దీంతో మధ్యాహ్నం వరకు పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుకున్నాయి. కూకట్‌పల్లి, వివేకానందనగర్‌కాలనీ, మూసాపేట, సుమిత్రానగర్ ప్రాంతాల్లోని బంకుల్లో సాయంత్రానికి నో స్టాక్ బోర్డులు పెట్టడంతో పెట్రోల్ కోసం వెళ్లిన వాహనదారులు వెనుతిరిగారు.

బాలానగర్/ఓల్డుబోయినపల్లి: బాలానగర్, ఓల్డుబోయినపల్లి ప్రాంతాల్లో కూడా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. పెట్రోల్, డీజిల్ కోసం క్యూ కట్టడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అవడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు.

గాజులరామారం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పలు పెట్రోల్ బంకులు మూతపడ్డాయి. గాజులరామారంలో హెచ్‌పీ పెట్రోల్ బంకులో వాహనదారులు బారులు తీరారు. జీడిమెట్ల డిపో వద్ద ఇండియన్ ఆయిల్ బంకు వద్ద పెట్రోల్ లేదని సిబ్బంది బారికేడ్లు అడ్డం పెట్టారు.



కూకట్‌పల్లిలో ఓ పెట్రోల్ బంకు వద్ద వాహనదారులు



కుత్బుల్లాపూర్‌లో పెట్రోల్ కోసం బారులు తీరిన వాహనదారులు



బోయినపల్లిలో పెట్రోల్ బంకు వద్ద..

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ



కొండాపూర్ ప్రేమ్‌నగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కూకట్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోంది. గత నెల 28వ తేదీ నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణకు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. ఐదు గ్యారెంటీలతో పాటు రేషన్ కార్డు లేని వారు కూడా దరఖాస్తులు అందజేస్తున్నారు. ఆయా కేంద్రాలను మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల ఉపకమిషనర్లు రమేష్, కృష్ణయ్య పర్యవేక్షించారు.

శేరిలింగంపల్లిలో 8,700 దరఖాస్తులు

గచ్చిబౌలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో భాగంగా శేరిలింగంపల్లి సర్కిల్‌లో మంగళవారం 8,700 దరఖాస్తులు అందాయని డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి తెలిపారు. ఐదు గ్యారెంటీలకు 6,200, సమస్యలపై 2,50 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఎక్కువగా రేషన్ కార్డులు, నీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

● మంత్రి సీతక్క

రవీంద్రభారతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్య అవసరాన్ని గుర్తించి మహిళా లోకానికి విద్యనందించిన గొప్ప ఆదర్శవంతురాలు సావిత్రిబాయి పూలే అని మంత్రి సీతక్క అన్నారు. రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తాధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సీతక్క పురస్కార గ్రహీతలను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. తనలాంటి ఎంతోమందికి సావిత్రిబాయి పూలే స్ఫూర్తిప్రదాత అని అన్నారు. సావిత్రి బాయి పేరిట అవార్డులు అందజేయడం సంతోషకరమన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, ఆరేపల్లి రాజేందర్, మేకల కీర్తి, సంస్థ అధ్యక్షురాలు మాధవి అవార్డు గ్రహీతలను సత్కరించారు.

'ట్రాన్స్‌జెండర్లకు పథకాలు అందజేయాలి'

హైదరాబాద్ సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు ట్రాన్స్‌జెండర్లకు అందేలా చూడాలని క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్, మోన్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు ముకుందమాల, వర్గీస్ థేకెనాథ్ ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీలో ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సిలిండర్‌పై రాయితీ, నెలవారీ ఆర్థిక సహాయం కూడా వర్తింపచేయాలని కోరారు. చాలామందికి రేషన్‌కార్డుల్లేవని, పథకాల దరఖాస్తుకు అందుబాటులో ఉన్న గుర్తింపు కార్డులను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. అభయహస్తం దరఖాస్తుల స్వీకరణకు ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని కోరారు.

మేనేజ్ - ఎన్‌ఐఆర్‌డీపీఆర్ అవగాహన ఒప్పందం

రాజేంద్రనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్(ఎన్‌ఐఆర్‌డీపీఆర్) మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇరు సంస్థల డైరెక్టర్ జనరల్స్ డాక్టర్ పి.చంద్రశేఖర, డాక్టర్ జి.నరేంద్రకుమార్ ఒప్పంద పత్రాలు స్వీకరించారు. గ్రామాల్లో వ్యవసాయం, అభివృద్ధిపై గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ)తో ముందుకెళ్లనున్నాయి. మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి మేలు చేసే విధంగా నడుచుకుంటాయి. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం), మహిళా స్వయం సహాయక సంఘాలు, అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీలు కలిసి పనిచేయనున్నాయి.

ఆన్‌లైన్, ఓడీఎల్ పద్ధతిలో ప్రోగ్రామ్‌లు అందించాలి

● అంబేడ్కర్ వర్సిటీ వీసీ సీతారామారావు

హైదరాబాద్ సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, ఓడీఎల్ పద్ధతిలో విద్యార్థులకు ప్రోగ్రామ్‌లు అందించేందుకు ఉద్యోగులు కృషి చేయాలని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె. సీతారామారావు అన్నారు. అంబేడ్కర్ వర్సిటీ 2024 డైరీ, క్యాలెండర్‌ను వర్సిటీ ప్రాంగణంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య కోసం యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని ఉద్యోగులను ఆదేశించారు. ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీ.ఆర్.ఎస్.రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి సేవలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్యోగులకు సూచించారు. విభాగాల అధిపతులు, డీన్లు అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు అభినందనలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యం శ్రీరంగం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

కూకట్‌పల్లి/కుత్బుల్లాపూర్ జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా ప్రజా ప్రతినిధులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ కూకట్‌పల్లి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్ కలిశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్‌ను కాంగ్రెస్ నాయకులు కలిశారు. కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. హరివర్ధన్‌రెడ్డిని ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, సీనియర్ నాయకులు సాదుప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను కాపు సంఘం నాయకులు, హెచ్‌ఎంటీ ఎంప్లాయీస్ యూనియన్, బీజేపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్‌తో కాంగ్రెస్ నాయకులు



మాజీ మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసిన కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ తదితరులు



క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

క్రైస్తవులకు దుస్తుల పంపిణీ

హైదర్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శంషీగూడలో ఫుల్‌గాస్పెల్ చర్చిలో క్రైస్తవులకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారుల సమన్వయ లోపంతో పండగ తర్వాత దుస్తులు పంపిణీ చేయడం బాధాకరమన్నారు. పాస్టర్లు ఇజ్రాయేల్, సత్యరాజ్, కర్ణాటక రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణి షేక్ జైనాబ్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

క్రీడాకారిణికి సన్మానం

హైదర్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన జాతీయ త్రోబాల్ చాంపియన్ షిప్‌లో రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించి రన్నరప్‌గా నిలిచిన హైదర్‌నగర్ డివిజన్ సెవెన్‌హిల్స్‌కి చెందిన క్రీడాకారిణి షేక్ జైనాబ్‌ను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కొండా విజయ్‌కుమార్ తదితరులు

మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో రంగారెడ్డి జిల్లాకు పతకాలు

చందానగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలో గతనెల 30, 31 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో 111 పతకాలు సాధించి రంగారెడ్డి జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలవడంతో అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 43 బంగారు, 33 రజత, 35 కాంస్య పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన వారిలో పీజేఆర్ స్టేడియంలో శిక్షణ పొందేవారు ఎక్కువగా సంఖ్యలో ఉన్నారు. ఏసురత్నం, మానస, నాగలక్ష్మీ బంగారు పతకాలు సాధించిన వారిలో ఉన్నారు.

ఘనంగా ఇరుముడి

రాయదుర్గం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నీలం నరేందర్ ముదిరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప ఇరుముడి కార్యక్రమాన్ని రాయదుర్గంలో మంగళవారం నిర్వహించారు. అయ్యప్ప మాలధారణ భక్తులు పూజలు నిర్వహించి శబరిమల బయలుదేరి వెళ్లారు.



అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు

పేట్‌బషీరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామయ్య ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి వచ్చిన అయోధ్య రామయ్య అక్షింతలను జీడిమెట్ల రాఘవేంద్రకాలనీలో రామభక్తులు మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు.

కారు ఢీకొని యువకుడి మృతి



రోహిత్‌రెడ్డి (ఫైల్)

రాయదుర్గం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. గచ్చిబౌలి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండకు చెందిన రోహిత్‌రెడ్డి(31) రెండేళ్ల క్రితం నగరానికి వచ్చి గౌలిదొడ్డిలో నివసిస్తూ ఓ కంపెనీలో సేఫ్టీ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారు జామున ద్విచక్రవాహనంపై గౌలిదొడ్డి నుంచి గచ్చిబౌలి వెళ్తున్నాడు. ఐఎస్‌బీ గేటు ఎదుట వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.